క్లుప్తంగా

ఎరువుల అమ్మకాల్లో తేడాలుంటే కఠిన చర్యలు


ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న డీఏవో

వెల్గటూర్: ఎరువుల అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి రాంచందర్ అన్నారు. శనివారం వెల్గటూర్, చెగ్యాం, జగదేవుపేట, గుల్లకోట గ్రామాల్లో ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, ఈ పాస్ మిషన్లు, బిల్లులు, రైతువారీ కొనుగోలు రిజిస్టర్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో ఫిర్దోజ్, ఫెర్టిలైజర్ షాప్ డీలర్లు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి


మాట్లాడుతున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో

రాయికల్: చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. శనివారం రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామంలో వ్యాధి నిరోధక టీకాలను పరిశీలించారు. చిన్నారులకు సమయానుకూలంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తే భవిష్యత్‌లో ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. ఆయన వెంట హెచ్‌ఈవో సాగర్‌రావు, సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఉన్నారు.

భూగర్భ జలాలను పరిరక్షించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వక్తలు

మల్యాల: భూగర్భ జలాలను కలుషితం కాంకుండా కాపాడడంతోపాటు, భవిష్యత్ తరాల కోసం భూగర్భ జలాలను సంరక్షించాలని, ప్రతి ఇంటా ఇంకుడు గుంతుల నిర్మాణం తోపాటు చెక్‌డ్యాంలు నిర్మించాలని వక్తలు అన్నారు. మల్యాల మండలం తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థులకు శనివారం భూగర్భ జలాల నిర్వహణపై సహాయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా భూగర్భ జలశాఖ అధికారి గంగనర్సింహ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాజకమల్, రాజ్‌కుమార్, రవీందర్ కుమార్, ప్రిన్సిపాల్ మానస, విద్యార్థులు పాల్గొన్నారు.

‘సొసైటీ నిధుల దుర్వినియోగం అవాస్తవం’


మాట్లాడుతున్న చైర్మన్ రమణారావు

పెగడపల్లి: మండల కేంద్రంలోని సొసైటీలో నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపణలు చేయడం బాధాకరమని చైర్మన్ వోరుగంటి రమణారావు అన్నారు. శనివారం నిర్వహించిన సొసైటీ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రూ. 6 లక్షల వరకు నష్టాల్లో ఉన్న సొసైటీని లాభాల్లోకి తీసుకెళ్లి రైతుల సంక్షేమం కోసం సొసైటీ అభివృద్ధి చేయడంతో పాటు పాలకవర్గం తీర్మానాల మేరకు దుకాణ సముదాయ భవన నిర్మాణం చేపట్టామన్నారు. భవన నిర్మాణంలో రూ. 1.80 లక్షలు దుర్వినియోగం జరిగాయని వస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదన్నారు. సొసైటీ అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఈవో గోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు, సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మెట్‌పల్లి: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం కమిషనర్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్రన్ మాట్లాడుతూ పెంచిన వేతనాల బకాయిలను చెల్లించాలని, ఈఎస్ఐని అమలు చేయాలన్నారు. అలాగే ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని, పండగ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జైపాల్‌రెడ్డి, ఉస్మాన్, మధురమ్మ, లక్ష్మణ్, శ్రీకాంత్, సుమన్ పాల్గొన్నారు.

నిందితులకు శిక్ష పడేలా చూడాలి

- ఎస్పీ అశోక్ కుమార్


మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: ప్రతీ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కోర్టు డ్యూటీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కోర్టుల్లో పెండింగ్ కేసులు, వారెంట్స్, సమన్స్ అంశాలపై సమీక్షించారు. కోర్టు కానిస్టేబుల్ బాధ్యత చాలా కీలకమైనదని, ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుంచి కేసు పూర్తయ్యేవరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాగ్మూలంను కోర్టుకు సమర్పించడంలో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సూచించారు. కేసుకు సంబంధించిన విషయాల్లో బాధితులు, సాక్షులకు అవగాహన కల్పించాలన్నారు. కేసు ట్రయల్స్ సమయంలో పీపీల సలహాలు, సూచనలు స్వీకరించాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ రవీంద్రకుమార్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, సీఎంఎస్ ఎస్సై రాజునాయక్, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి అంగన్‌వాడీల సమస్యలు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ నాయకులు

జగిత్యాల: అంగన్‌వాడీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలు పలు సమస్యలను విన్నవించగా, ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు స్వప్న, రజిత, జ్యోతి పాల్గొన్నారు.

యావర్ రోడ్డు విస్తరణకు కృషి

జిల్లా కేంద్రంలో ప్రధానమైన యావర్‌రోడ్ విస్తరణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో డ్రెయినేజీ, సీసీరోడ్లకు సంబంధించి రూ.25 లక్షల నిధులు కేటాయించగా శనివారం పనులు ప్రారంభించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో టీయూఎఫ్ఐడీసీ నిధుల కింద మున్సిపల్‌కు నిధులు మంజూరయ్యాయని, జిల్లా కేంద్రం త్వరగా విస్తరిస్తుందన్నారు.

ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు

రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని లింగంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సీఈవో వేణు, గిరి నాగభూషణం, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరుపాల్గొన్నారు.

సేవాభారతి సేవలు గొప్పవి

జగిత్యాలటౌన్: వాల్మీకి ఆవాసం సేవాభారతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణా ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానంచేశారు. కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కౌన్సిలర్ ఒద్ది శ్రీలత, నాయకులు గిరి నాగభూషణం పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో రాంచంద్రం

వెల్గటూర్: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌తో జీవితాలు నాశనమైపోతాయని ఎంఈవో రాంచంద్రం అన్నారు. శనివారం గుల్ల కోట జడ్పీ హైస్కూల్‌లో మాదకద్రవ్యాల నిర్మూలనపై తయారు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఎంతో మంది జీవితాలు నాశనం చేసుకున్నారని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు మండలం లోని ప్రతీ పాఠశాలలో ప్రహరీ కబుర్లు ఏర్పాటు చేశామని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షకులు శనిగారపు రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ‘అడ్లూరి’ అవగాహన తెచ్చుకోవాలి

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అవగాహన తెచ్చుకోవాలని బీఆర్ఎస్ మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులపై సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తొలగించి పంపిణీ చేస్తున్నారని ఆరోపించడం అతడి అవివేకానికి నిదర్శనమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, రైతుబంధు కమిటీ మాజీ మండల అధ్యక్షుడు కోమ్ముల జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్‌వై రాష్ట్ర నాయకులు బదినపెల్లి ప్రేమ్, మండల అధ్యక్షుడు మ్యాకల సతీష్, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మల్యాల:మండలంలోని నూకపల్లి, మద్దుట్ల, రాజారం, పోతారం, గొల్లపల్లి, ఒబులాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంపతులను కాంగ్రెస్ నాయకులుసన్మానించారు. కార్యక్రమంలో నూకపల్లి పాక్స్ చైర్మన్ బోయినపల్లి మధుసూదన్‌రావు, నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

వెల్గటూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ హెచ్చరించారు. శనివారం ఎండపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ముఖ్య కార్య నిర్వహణాధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీవో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు పూర్తయిన వెంటనే ట్యాబ్‌లో నమోదు చేయాలని, కేంద్రంలో అన్నిరకాల వసతులు ఉండేలా చూడాలని, రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో వెల్గటూర్, ఎండపల్లి సీఈవోలు రాజయ్య, రవి పాల్గొన్నారు.

34 మందికి ఐపీ నోటీసులు

మెట్‌పల్లి: పట్టణంలోని వెల్లుల్ల రోడ్‌లో కిరాణం నిర్వహిస్తున్న వ్యాపారులు వావిలాల సత్తయ్య, రాజశేఖర్, అనిల్ 34 మందికి కోర్టు ద్వారా ఐపీ నోటీసులు ఇచ్చారు. వ్యాపారంలో రూ.28.70లక్షలు దివాలా తీసిన తమకు అప్పులు ఇచ్చిన వారితో ప్రాణభయం ఉందంటూ కోర్టును ఆశ్రయించారు. దానిని పరిశీలించిన మేజిస్ట్రేట్ ఐపీ నోటీసులు జారీ చేశారు. కొంతకాలంగా పలువురు ఐపీలు పెడుతుండడంతో రుణాలు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు.

ముగ్గురు యువకులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు

మల్యాల: మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. రామన్నపేట గ్రామానికి చెందిన బంద ఆంజనేయులుకు అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు యువకుల మధ్య భూమి విషయంతో వివాదం జరిగింది. యువకులు తనను కులం పేరుతో దూషించాడనే బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక

జగిత్యాల: తమిళనాడు రాష్ట్రంలోని కరైకుడిలోని అలగప్ప విశ్వవిద్యాలయంలో జరగనున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ కబడ్డీ పోటీలకు జగిత్యాల సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని తేజావత్ పావని శాతావాహన యూనివర్సిటీ నుంచి ఎంపికయ్యారు. నవంబర్ 26 నుంచి 29 వరకు జరిగే ఈ పోటీల్లో విద్యార్థి పాల్గొననుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ గునుక శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్ హరిరాం అభినందించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ..

రాయికల్:ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన సుల్తానా అండర్ -17 బాలికల విభాగంలో ఎంపిక కాగా, ఇటిక్యాల మోడల్‌స్కూల్‌కు చెందిన కె.వర్ధన్ అండర్ -17 కబడ్డీలో, చిన బాబు అండర్-14 కబడ్డీ విభాగంలో, భార్గవి బాలికల విభాగంలో వాలీబాల్‌లో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ప్రిన్సిపాల్స్ సంతోష్, శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు కిశోర్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలకు మేథమెటిక్స్ బాక్స్‌ల వితరణ

మల్లాపూర్: మండలంలోని వేంపల్లి ప్రాథమిక పాఠశాలకు పెద్దపల్లి జిల్లా ఉద్యోగి అనిత తన పుట్టిన రోజు సందర్భంగా రూ.5వేల విలువ గల మేథమెటిక్స్ బాక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బిట్ల నరేష్, గంగగౌరీశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ కోమటిరెడ్డి కష్టారెడ్డి, హెచ్ఎం హరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో పోలీసుల సేవలు వెలకట్టలేనివి

మల్లాపూర్: విధి నిర్వహణలో పోలీసుల సేవలు వెలకట్టలేనివని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, విద్యార్థులు సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల త్యాగాలు మరువలేనివన్నారు. కుటుంబాన్ని, పండుగలు, పబ్బాలను సైతం త్యజించి.. ప్రజల కోసం పనిచేసే పోలీసుల సేవలు గొప్పవన్నారు.కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు కోటేశ్వర్‌రాజు, నీలినాయక్, నర్సింగరావు, కానిస్టేబుళ్లు రత్నాసాగర్, నరేందర్, వేణు, వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత చెడు దారులకు అలవాటు పడొద్దు

ఇబ్రహీంపట్నం: యువత చెడు దారులకు అలవాటు పడవద్దని మంచి అలవాట్లు నేర్చుకోవాలని ఎస్సై అనిల్ అన్నారు. శనివారం పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వేములకుర్తిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఆశోక్‌కుమార్, కానిస్టేబుల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో శనివారం పోలీస్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నిఖిల్ భరత్ హైస్కూల్ వద్ద ఈ ర్యాలీని సీఐ నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. అక్కడి నుంచి పలు వీధుల గుండా ఇది సాగింది. విద్యార్థులతో కలిసి సీఐ సైకిల్ నడిపి వారిని ఉత్సాహపరిచారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

సారంగాపూర్: మండలంలోని ఆరు గ్రామాల్లో ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్) కింద 23 మంది దరఖాస్తు చేసుకోగా ఆయా గ్రామాల్లో ఎంపీడీవో చౌడారపు గంగాధర్ ఆధ్వర్యంలో శనివారం అధికారులు దరఖాస్తుదారుడు కొనుగోలు చేసిన ప్లాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చౌడారపు గంగాధర్, ఆర్ఐ భాస్కర్‌రావు, ఏఈ నీటిపారుదల శాఖ అనిల్, పంచాయతీ కార్యదర్శులు ప్రేమలత, కార్యదర్శులు ఉన్నారు.

గల్ఫ్ బాధితుల వివరాలు సేకరణ

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో గల్ఫ్ బాధిత కుటుంబాల వివరాలను శనివారం రెవెన్యూ అధికారులు సేకరించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యలయంలో ఆర్ఐ సురేష్ గ్రామానికి చెందిన గల్ఫ్‌లో ఇటీవల మృతి చెందిన కందెల వెంకటి(41) కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరించారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జగిత్యాల టౌన్-2 సెక్షన్ పరిధిలోని జంబిగద్దె ప్రాంతం, అశోక్‌నగర్, మోతె రోడ్, నాగేంద్రనగర్, చిలుకవాడ, గాయత్రిబ్యాంక్ ఏరియా, మోచీబజార్, బుక్కవాడ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ రాజిరెడ్డి తెలిపారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలని వినతి

ధర్మపురి: ఉన్నతాధికారులు తమపై విధించిన సస్పెన్షన్లను ఎత్తివేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు శనివారం క్యాంపు కార్యాలయంలో ఏఈవోలు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా విప్ స్పందిస్తూ, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

దండారి వేడుకలు ప్రారంభం


నృత్యాలు చేస్తున్న ఆదివాసీలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని వివిధ ఆదివాసీ గొండు గూడాల్లో దండారి పండగ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దీపావళి పండగకు ముందు బీర్‌పూర్ మండలంలోని మంగేళ గొండుగూడెం,చిత్రవేణిగూడెం, చిన్నకొల్వాయి గ్రామాల్లో దండారి పండగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శనివారం మంగేళ గొండుగూడెంలో ఆదివాసి గొండులు తమ సాంప్రదాయ వేషధారణలో, వారి ఆరాధ్యదైవం ఏత్మాసర్ దేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, పురుషులు పాటలు పాడుతూ, గుస్సాడి నృత్యాలు డప్పు చప్పుళ్లతో గొండుగూడాల్లో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆదివాసీలు పాల్గొన్నారు.

సమాజ సేవలో మున్నూరుకాపులు ముందుండాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

జగిత్యాల: సమాజ సేవలో మున్నూరుకాపులు ముందుండాలని, దేశానికి అన్నం పెడుతున్నది రైతులేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని భాగ్యరాజ్ ఫంక్షన్‌హాల్‌లో 36వ పటేల్స్ నెట్‌వర్క్ పెన్ బిజినెస్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జిల్లా నుంచే కాక మున్నూరుకాపు కులానికి చెందిన రాజకీయ, సామాజిక, వ్యవసాయ, వ్యాపార, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇందులో ప్రతినిధులున్నారని, నైపుణ్యాలను, అనుభవాలను పంచుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, అశోక్‌కుమార్, కృష్ణానందరెడ్డి, అంజయ్య, వెంకటనారాయణ, వెంకటేశ్వర్‌రావు, రవికుమార్, గంగారెడ్డి పాల్గొన్నారు.

‘కల్వకుంట్ల కుటుంబానిదే వ్యభిచార రాజకీయం’

కోరుట్ల: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు కల్వకుంట్ల కుటుంబం చేసేదంతా వ్యభిచార రాజకీయమేనని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో శనివారం మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బుకు అమ్ముడుపోయి దొంగ ఓటు వేసిన చరిత్ర మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుదన్నారు. కాంగ్రెస్, టీడీపీ, బీఎస్పీ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను పార్టీలో కేసీఆర్ చేర్చుకోవడం రాజకీయ వ్యభిచారం కాదా అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆడెపు మధు, అంతడుపుల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎంపీవో సస్పెన్షన్

సారంగాపూర్: బీర్‌పూర్ మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) అంబటి వెంకటరామకృష్ణరాజు నిధులు దుర్వినియోగం చేశాడని కలెక్టర్ సస్పెండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు ఈ పంచాయతీ ఆపరేటర్ల జీతభత్యాలకు ఎంపీడీవో, ఎంపీవో సంతకం చేసి జాయింట్ ఖాతా నుంచి డ్రా చేయాల్సి ఉండగా, ఎంపీవో తన పేరున సొంతంగా చెక్కులు రాసుకుని తన ఖాతాలో డబ్బు జమ చేసుకున్నాడు. డ్రా చేసిన డబ్బులకు ఎలాంటి బిల్లులు జతచేయలేదని విచారణ తేలడంతో కలెక్టర్ సస్పెండ్ చేశారు.

నాణ్యమైన కెపాసిటర్లు అమర్చుకోవాలి

మేడిపల్లి: వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు, స్టార్టర్లు, ఫీజులు నాణ్యతగా ఉండేలా రైతులు చూసుకోవాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సాలియా నాయక్ పేర్కొన్నారు. శనివారం మేడిపల్లి, భీమారం మండలాల్లోని కాచారం, వెంకట్రావుపేట్ గ్రామాల్లో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లో ఓల్టేజీ సమస్య రాకుండా ప్రతీ రైతు కెపాసిటర్ అమర్చుకోవడం తప్పనిసరని సూచించారు. విద్యుత్ సమస్యలుంటే అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు. మూగజీవాలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా చూసుకోవాలన్నారు. మెట్‌పల్లి డీఈ గంగారాం, కోరుట్ల రూరల్ ఏడీఈ రఘుపతి, ఏఈలు అశోక్, అర్జున్, సబ్ ఇంజినీర్ ఎక్కల్‌దేవి హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి అభివృద్ధికి పశుగణన కీలకం

రాయికల్: పాడి పరిశ్రమ అభివృద్ధికి పశుగణన ఎంతో కీలకమని జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్ బోనగిరి నరేశ్ అన్నారు. మండలంలోని శ్రీరాంనగర్, సింగరావుపేట గ్రామాల్లో నిర్వహించిన ఉచిత గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని ఆకస్మికంగా సందర్శించారు. పాడి రైతులందరూ పశుగణనకు సహకరించాలన్నారు. పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించేలా చూడాలన్నారు. డాక్టర్ నరేశ్‌రెడ్డి, వైద్య సిబ్బంది నరేశ్, పోచయ్య, రైతు సంఘం నాయకులు చంద్రగౌడ్, మల్లేశ్, బద్దం శేఖర్‌రెడ్డి, అరవింద్, కృష్ణరెడ్డి పాల్గొన్నారు..

టీజీఎస్ఆర్టీసీ ద్వారా హోం డెలివరీ

కోరుట్ల: తెలంగాణ ఆర్టీసీ లాజిస్టిక్ సర్వీస్ ద్వారా హైదరాబాద్‌లో హోం డెలివరీ అవకాశం కల్పిస్తున్నామని టీజీఎస్ ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామారావు శనివారం ప్రకటనలో తెలిపారు. హైదరా బాద్‌లో ఉండే బంధుమిత్రులు, విద్యార్థులకు కార్గో సర్వీస్ ద్వారా హోం డెలివరీ బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతీ జిల్లా, మండల కేంద్రాల్లో కార్గో సర్వీస్ కార్యాలయంలో బుక్ చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన

ధర్మపురి: మండల కేంద్రంలోని సమైక్య కార్యాలయంలో మండల ఆర్గనైజర్ అల్లె రాజేశం శనివారం బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతిమ ఫౌండేషన్ ద్వారా ఉచిత క్యాన్సర్ పరీక్షలను నిర్వహిస్తారని అదే విధంగా ప్రతిమ ఆస్పత్రి సేవల గురించి, ఫౌండేషన్ ద్వారా నిర్వహించబడుతున్న ఉచిత స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం రమాదేవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం:మండలంలోని వేములకుర్తిలో శనివారం ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజును, డైరెక్టర్ గుమ్మల రమేశ్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాధరావు దేవదాస్, ఆరె రమేష్, తరి రామనుజం, ఎడిపెల్లి మురళి, మాలేపు శ్రీనివాస్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెగడపల్లి:మండలంలోని నందగిరి, రాములపల్లి, నంచర్ల, దీకొండ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన 93 సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల కాంగ్రెస్ శ్రేణులు శనివారం పంపిణీ చేశారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్:కథలాపూర్ మండలం పెగ్గెర్ల, దూలూర్ గ్రామాల్లో పలువురికి సీఎమ్మార్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసినట్లు మండల కాంగ్రెస్ నాయకులు శనివారం తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డీఅజీమ్, నాయకులు పాల్గొన్నారు.

జగన్నాథపూర్‌లో వైద్య శిబిరం

రాయికల్: మండలంలోని జగన్నాథపూర్‌లో శనివారం ఒడ్డెలింగాపూర్ మెడికల్ ఆఫీసర్ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో సాగర్‌రావు, సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలోని కల్వకోట, భీమారం, పసునూర్, వెంకట్రావుపేట గ్రామాల్లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు.

ఇసుక లారీలు సీజ్

కథలాపూర్: కథలాపూర్ మండలం నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా రెండు లారీలల్లో ఇసుకను తరలిస్తుంటే పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ మేరకు కథలాపూర్ శివారులో పోలీస్‌సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టామన్నారు. రెండు లారీలల్లో ఇసుక కనిపించడంతో వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామని ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

విద్యార్థుల జోష్...



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో స్వాగతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్యక్రమంలో కరస్పాండెంట్ నరేశ్, ప్రిన్సిపాల్ ఈశ్వర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: 2024-25 విద్యా సంవత్సరానికి గాను పారామెడికల్ కోర్సులకు ఇంటర్మీయెట్ బైపీసీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఖాద్రి తెలిపారు. బైపీసీ, ఎంపీసీ విద్యార్థులు లేని పక్షంలో ఇతర గ్రూపుల దరఖాస్తులను కూడా పరిశీలించబడతాయని, రూ.100 చెల్లించి ప్రభుత్వ కళాశాలలో దరఖాస్తు ఫాం పొందాలని పేర్కొన్నారు. ఈనెల 30లోపు దరఖాస్తులు కళాశాలలో అందజేయాలని వివరించారు.

హార్డ్‌కాపీలు అందజేయాలి

జిల్లాలోని గిరిజన విద్యార్థుల ఉపకార వేతనాలకు సంబంధించి (2017-18 నుంచి 2021-22 వరకు) ఫ్రెష్, రెన్యువల్ యుటిలైజేషన్ సర్టిఫికెట్ల దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి చేసి హార్డ్‌కాపీలను గిరిజనాభివృద్ధి అధికారి కార్యాలయం కరీంనగర్‌లో ఇవ్వాలని జగిత్యాల గిరిజనాభివృద్ధి అధికారి నీలిమ తెలిపారు. కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వకుంటే స్కాలర్‌షిప్‌లు మంజూరు కావని, ప్రిన్సిపాల్స్ అందరూ పంపించేలా చూడాలని పేర్కొన్నారు. మిగతా వివరాలకు 95026 64044 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.